

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

..అనే నేను

- వేడుకగా ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- ఆరోసారి కన్నా, ధూళిపాళ్ల, ఐదోసారి గొట్టిపాటి..
- నియోజకవర్గాల్లో పెద్దఎత్తున శ్రేణుల సంబరాలు










గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఉత్సాహంగా సీనియర్లు.. ఉత్సుకతతో తొలిసారి ఎన్నికైన వారు శుక్రవారం అసెంబ్లీలోకి అడుగు పెట్టారు. ..అనే నేను అంటూ శుక్రవారం అమరావతిలోని అసెంబ్లీ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత సీఎం చంద్రబాబు, ఆ తర్వాత ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రమాణ స్వీకారం చేయించగా ఆ తర్వాత మంత్రులు, అక్షర క్రమంలో ఎమ్మెల్యేలు వరుసగా ప్రమాణ స్వీకారం చేశారు. అనే నేను.. శాసనసభ సభ్యుడిగా ఎన్నికైనందున శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతా.. అంటూ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయా ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం అనంతరం స్పీకర్ స్థానంలో ఉన్న బుచ్చయ్యచౌదరిని కలవడం ఆ తర్వాత చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌లకు ఇతర సీనియర్ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలపగా ఆయా నేతలతో పాటు సహచరులు వారిని ప్రత్యేకంగా అభినందించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి తొలుత మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. సచివాలయంలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాలను వారివారి నియోజకవర్గాల్లో శ్రేణులు ప్రత్యేకంగా తిలకించారు. టపాకాయలు కాల్చి, కేకులు కట్ చేసి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఇక గుంటూరు, బాపట్ల నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికై మంత్రులుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్ (మంగళగిరి), నాదెండ్ల మనోహర్(తెనాలి), అనగాని సత్యప్రసాద్(రేపల్లె), గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి) తొలుత ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. ఆరోసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టి ప్రమాణ స్వీకారం చేసిన వారిలో కన్నా లక్ష్మీనారాయణ (సత్తెనపల్లి), ధూళిపాళ్ల నరేంద్ర (పొన్నూరు)లు ఉన్నారు. అక్షర క్రమంలో పల్నాడు జిల్లాకు చెందిన యరపతినేని శ్రీనివాసరావు(గురజాల), ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట), జూలకంటి బ్రహ్మారెడ్డి(మాచర్ల), డాక్టర్ చదలవాడ అరవిందబాబు (నరసరావుపేట), భాష్యం ప్రవీణ్ (పెదకూరపాడు) ప్రమాణం చేశారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శనివారం ప్రమాణం చేయనున్నారు. బాపట్ల జిల్లాకు సంబంధించి వేగేశన నరేంద్రవర్మ(బాపట్ల), ఎంఎం .కొండయ్య(చీరాల), నక్కా ఆనంద్‌బాబు(వేమూరు), ఏలూరి సాంబశివరావు(పర్చూరు) ప్రమాణ స్వీకారం చేశారు. ఇక గుంటూరు జిల్లాకు సంబంధించి గళ్లా మాధవి(గుంటూరు పశ్చిమ), మొహమ్మద్ నసీర్ (గుంటూరు తూర్పు), బూర్ల రామాంజనేయులు(ప్రత్తిపాడు), తెనాలి శ్రావణ్ కుమార్(తాడికొండ)లు శాసనసభలో ప్రొటెం స్పీకర్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.



ప్రమాణం చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ, ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవి, ఎంఎం కొండయ్య

ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తా: నారా లోకేశ్

కూటమి నేతృత్వంలో కొలువైన ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్షను నెరవేర్చే విధంగా పనిచేస్తుందని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంగళగిరి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన భావోద్వేగ క్షణాలను ఆస్వాదిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఆశీస్సులతో తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టి శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేయడం జీవితంలో మరపురాని మధుర ఘట్టమన్నారు. ప్రజలు తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ అవకాశాన్ని వారి సంక్షేమం, అభివృద్ధి కోసం వినియోగిస్తానని తెలిపారు.




బాపట్ల జిల్లా నుంచి ప్రమాణం చేస్తున్న అనగాని సత్యప్రసాద్, నక్కా ఆనందబాబు



గుంటూరు జిల్లా నుంచి ప్రమాణం చేస్తున్న నారా లోకేశ్, నరేంద్ర, శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, నాదెండ్ల మనోహర్, గళ్లా మాధవి, నసీర్ అహ్మద్







పల్నాడు జిల్లా నుంచి కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్

- కేంద్ర సహాయమంత్రిగా గుంటూరులో తొలిఅడుగు
- కాజా టోల్‌ప్లాజా నుంచి ఐదుగంటల పాటు సాగిన ర్యాలీ
- వందల కార్లు, వేలాది బైకులతో హోరెత్తించిన అభిమానులు
- హామీలు నెరవేర్చేందుకు సొంత డబ్బునైనా ఖర్చు చేస్తా : చంద్రశేఖర్

పెమ్మసాని.. విజయోత్సాహం





గుంటూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తన సొంత నియోజకవర్గం గుంటూరులో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం తొలి అడుగు వేశారు. ఈ సందర్భంగా చేపట్టిన విజయోత్సవ ర్యాలీకి అభిమానులు, కూటమి శ్రేణులు నీరాజనాలు పలికారు. కాజ టోల్ ప్లాజా వద్ద ప్రారంభమైన ప్రదర్శన గుంటూరు నగరంలోకి సాయంత్రం ఐదున్నర గంటలకు ప్రవేశించగా సమావేశ ప్రాంతమైన శ్రీ కన్వెన్షన్ చేరుకునే సరికి రాత్రి పది గంటలు దాటింది. పెమ్మసానికి వందలాదిమంది తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు, బీజేపీ నేతలు, స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. బాణాసంచా పేల్చి, తారాజువ్వలు ఎగరేసి, అడుగడుగునా భారీ గజమాలలతో స్వాగతం పలికారు. డీజేలు, దాండియాల మోతలతో ఆయనను ఊరేగించారు. లాడ్జి సెంటర్లో జనసైనికులు, తాడిశెట్టి యూత్, నాయుడుపేట సెంటర్‌లో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, 46వ డివిజన్లో కార్పొరేటర్ బాలాజీ భారీ గజమాలలతో పెమ్మసానికి స్వాగతం పలికారు. టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ 1500 బైక్‌లు, 500 కార్లతో గుంటూరు నుంచి ర్యాలీగా కాజ టోల్ గేట్‌కు ఎదురెళ్లి పెమ్మసానికి స్వాగతం పలికారు.

అమరావతి, రైల్వే అభివృద్ధి కోసం కృషి చేస్తా

ప్రదర్శన అనంతరం శ్రీకన్వెన్షన్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పెమ్మసాని ప్రసంగించారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు. రాజధాని అమరావతి, రైల్వే అభివృద్ధి సహా, ఐదేళ్లుగా ఆగిపోయిన ప్రతి పనిని పూర్తిచేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని, అవసరమైతే సొంత నిధులు వెచ్చిస్తానని తెలిపారు. పేదవాడు.. అవినీతి ఉండకూడదు.. గ్రామాలు అభివృద్ధి చెందాలి.. అన్న లక్ష్యాలతో ముందుకు సాగుతానన్నారు. అమరావతికి పట్టిన చీకట్లు చెరిగిపోయాయని, కిరణాల వెలుగు మొదలైందన్నారు. కొంచెం సమయం ఇవ్వండి.. అభివృద్ధిని చేసి చూపించే బాధ్యత తమదన్నారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్, బూర్ల రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్ కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, పెమ్మసాని సతీమణి శ్రీరత్న, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, టీడీపీ నాయకులు కోవెలమూడి రవీంద్ర, మన్నవ మోహన్‌కృష్ణ, ముత్తినేని రాజేశ్, నిమ్మల శేషయ్య, తాడిశెట్టి మురళి, పాటిబండ్ల విష్ణువర్ధన్, వాసిరెడ్డి జయరామయ్య, యాగంటి దుర్గారావు, పొందూరి శేషగిరిరావు, ఉగ్గిరాల సీతారామయ్య, మద్దిరాల మ్యాని, వనమా నరేంద్ర, ముజీబ్, భీమ నాథం భరత్‌రెడ్డి, రజిని, తాళ్ల వెంకటేశ్ యాదవ్, వద్రాణం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్ వద్ద పెమ్మసాని ర్యాలీ


వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న చంద్రబాబునాయుడు

ఎన్టీఆర్‌కు నివాళి

తుళ్లూరు, జూన్ 21: ఎప్పటిలాగే వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండం వేసి నివాళి అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం అసెంబ్లీలో అడుగు పెట్టారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, మంత్రులు వెంకటపాలెం గ్రామస్థులు, అమరావతి రైతులు ఘనస్వాగతం ఏర్పాటు చేశారు. నారా చంద్రబాబు నాయుడు అను నేను.. అని పూలతో అలంకరించారు. జై బాబు, జైజై బాబు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు చంద్రబాబు నాయుడితో పాటు ఎన్టీఆర్‌కు నివాళి అర్పించి అసెంబ్లీకి వెళ్లారు.

రైలు నుంచి జారి వ్యక్తి మృతి


ట్రాక్ పక్కన పడి ఉన్న మృతదేహం

తెనాలి క్రైం, జూన్ 21: విజయవాడ నుంచి తిరుపతి వెళుతూ రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం తెనాలి రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. తెనాలి రైల్వేపోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల మేరకు చుండూరు రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం పడిఉందన్న సమాచారంతో వెళ్ళి పరిశీలించగా సుమారు 40-45సంవత్సరాల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. మృతదేహం వద్ద ఎవరి ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

- పాతుకుపోయిన వైసీపీ భక్త బృందం !
- సాధారణ బదిలీలలో భారీ మార్పులు ఉండే అవకాశం
- ముఖ్య అధికారులకు తప్పని స్థాన చలనం

జడ్పీలో.. జలగలు

గుంటూరు సిటీ, జూన్ 21: గుంటూరు జిల్లా పరిషత్‌లో కొందరు ఉద్యోగులకు ఇంకా వైసీపీ మత్తు వదల్లేదు. పాత ప్రభుత్వమే అధికారంలో ఉందన్న భ్రమలో విహరిస్తున్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ నేతలను అడ్డం పెట్టుకుని బదిలీలు కాకుండా పాతుకుపోయిన వారంతా ఆ మేరకు స్వామి భక్తిని ప్రదర్శిస్తూనే వున్నారు. ఇక్కడ దీర్ఘకాలికంగా పాతుకుపోయిన ఉద్యోగులు ఒక కోటరీగా మారి జిల్లా పరిషత్‌కు సంబంధించిన అనేక ముఖ్య విషయాల్లో చాలా గోప్యత పాటిస్తున్నారు. ప్రభుత్వం మారినా ఇంకా ఆదే మూస ధోరణిలో జడ్పీ ఉద్యోగులు వ్యవహరిస్తూ ఉండటం మిగిలిన వారిలో అసహనం కలిగిస్తోంది. ఎన్నికల సమయంలో వైసీపీకి పూర్తి అనుకూలంగా పనిచేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు సైతం కీలక స్థానాల్లో ఉండటం పట్ల పలువురు ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద త్వరలో జరగనున్న సాధారణ బదిలీల్లో జిల్లా పరిషత్ పూర్తి ప్రక్షాళన జరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

ఎక్కువ మంది వాళ్లే..

ఒకప్పుడు జిల్లా పరిషత్‌లో ప్రభుత్వం ఏదైనా అన్ని వర్గాలకు చెందిన ఉద్యోగులు ఉండే వారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పాత పద్దతికి పాతర వేసింది. టీడీపీకి చెందిన వారిని ముద్ర వేసి మరీ చాలామంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఎమ్మెల్యేలు చెప్పారన్న సాకుతో చివరకు మహిళా ఉద్యోగులను కూడా సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. అర్హత లేనప్పటికీ వైసీపీ అనుకూల ఉద్యోగులను అందలం ఎక్కించారు. మూడేళ్ళ గడిచి బదిలీకి అవకాశం ఉన్నప్పటికీ టీడీపీ సానుభూతి పరులుగా ముద్ర పడిన ఉద్యోగులను గుంటూరు జడ్పీకి రాకుండా అడ్డుకున్నారు. సామాజిక వర్గం ఆధారంగా జిల్లా పరిషత్ ఉద్యోగులకు పార్టీల అంటకట్టి సుదూర ప్రాంతానికి బదిలీచెయ్యటం గత ప్రభుత్వంలో యధాలాపంగా జరిగిపోయింది.

ఆడిందే ఆట......

ఐదేళ్ల పాటు జడ్పీలో పాతుకుపోయిన వైసీపీ అనుకూల వర్గం జడ్పీలో వున్న పాత వసతులను పూర్తిగా పాతర వేసింది. ఒక ముఖ్య అధికారి చాలా రోజులపాటు అన్ని విషయాలను శాసించారు. తనకు అనుకూలంగా ఉన్న వారిని అన్ని విధాలా సమర్ధించి, మిగిలిన వారిని వేధింపులకు గురిచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయనపై ఎన్నికల సమయంలో కూడా పలు ఆరోపణలు వచ్చాయి. వైసీపీకి అనుకూలంగా లేని ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. మరికొన్ని కీలక విభాగాల్లో ఉన్న అధికారులు కూడా పాత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు చెప్పినట్టే అన్నీ చేశారు. నిబంధనలు అతిక్రమించి పైస్థాయి వరకు పనులు పెట్టించారు. జడ్పీ ఆదాయ వనరులను వైసీపీ నేతలకు అనుకూలంగా మార్చారు అన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్నో జరిగినా ఏ విషయం బయటకు పొక్కకుండా చాలా జాగ్రత్తలు పడ్డారు. వైసీపీకి వ్యతిరేకంగా ఉండే పత్రికలకు సరైన సమాచారం కూడా ఇవ్వని దాఖలాలు లేవు.


కదులుతున్న పీఠాలు

త్వరలో జరగనున్న సాధారణ బదిలీలలో జడ్పీలోని ముఖ్య పీఠాలు కదిలే అవకాశం ఉంది. త్వరలో పదవీ విరమణ పొందే అవకాశం ఉండటంతో ముఖ్య అధికారి వారి సొంత జిల్లాకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఆయనపై పార్టీ ముద్ర లేనప్పటికీ తనకు తాను ఈ ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో అధికారి బదిలీ కోసం కొందరు బలంగా పట్టుపడుతున్నారు. ఆయన వైసీపీకి పూర్తి అనుకూలంగా ఉండి, ఎన్నికల్లో ఆ పార్టీ కి మేలు జరిగే విధంగా పనిచేసినట్లు కొందరు ఇప్పటికే గెలిచిన ముఖ్యనేతల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా విభాగాల్లో ఉన్న మరి కొందరు అధికారులను కూడా జడ్పీ నుంచి పంపివేయాలని నేతల వద్ద ప్రతిపాదనలు పెట్టారు. ఈ మేరకు జాబితా ఒకటి తయారు చేసి నేతలకు అందజేసినట్లు సమాచారం. మొత్తం మీద జూలై మాసంలో జడ్పీలో భారీ మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉంది.



శ్రీత్రికోటేశ్వరస్వామికి పాలతో అభిషేకం..

వైభవంగా రుద్రాభిషేకం

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ దేవస్థానంలో శ్రీ త్రికోటేశ్వర స్వామికి శుక్రవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా జరిగింది. జేష్ఠ పూర్ణిమ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాలతో, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.
- నరసరావుపేట

తాగునీరు.. కలుషితం

- వాంతులు, విరేచనాలతో 10 మంది దళితకాలనీ వాసులు
- ఇరువురిని జీజీహెచ్‌కి తరలింపు
- నాటి వైసీపీ తప్పిదాలే నేటి సమస్యలు


కాలనీవాసులు తాగేంది కలుషితమైన ఈ బోరు నీటినే..

దాచేపల్లి, జూన్ 21: తాగునీరు కలుషితం కావడంతో ఆ నీరు తాగిన దళిత కాలనీవాసులు వాంతులు, విరేచనాలకు గురై ఆసుపత్రి పాలైన ఘటన శుక్రవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీలో జరిగింది. ఎస్సీ కాలనీలో రెండు బోర్ల నుంచి కాలనీవాసులు తాగునీటికి, ఇతర అవసరాలకు నీటిని వాడుతుంటారు. గత నాలుగు రోజులుగా కాలనీలో వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి చెందిన వినుకొండ కోటయ్య ఆరోగ్యపరిస్థితి విషమంగా వుండటంతో గుంటూరు తరలించారు. కాలనీలో పదో తరగతి చదువుతున్న శ్రీపతి మెర్సీ, 8వ తరగతి చదువుతున్న మీసాల మౌనిక, వృద్ధ సాయి జనులు చేసుకుంటూ జీవనం సాగించే పచ్చి లక్ష్మి, వింజ మూరి కమలమ్మ, వంగూరి నాగమ్మ, వినుకొండ రత్నబాబు, పేరుపోగు జగన్, పుల్లేరు లింగమ్మ, శ్రీపతి బాస్కర్‌రావుతో పాటు దాచేపల్లిలోని ఆస్పత్రుల్లో నివసిస్తున్న యాదలపురం వెంకట నర్సమ్మ, కమ్మరిబజారులో నివసిస్తున్న మరో ఇద్దరు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు పాలయ్యారు. దయనీయంగా గుర్తి అనుపత్రిపాలైన వీరంతా పేదకుటుంబాలకు చెందిన వారే.


ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్న కేశానుపల్లి ఎస్సీ కాలనీవాసులు

ట్యాంకులు శుభ్రం చేయకపోవడమే ప్రధాన కారణం

ఎస్సీ కాలనీలో వున్న బోర్ల నుంచి పైపులైన్ ద్వారా ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయకపోవడం ప్రధాన కారణంగా కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఈ ట్యాంకుల నుంచి వస్తున్న నీరు రంగు, రుచి మారి దుర్వాసన వెదజల్లుతుంది. అధికారులు తమ కాలనీ పై దృష్టి సారించాలని, తమకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు. గ్రామంలో డయేరియా వ్యాపించిందన్న సమాచారంతో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఇంటింటికి తిరిగి రోగులను గుర్తించి వైద్యసేవలందిస్తున్నారు.


చికిత్స పొందుతున్న మీసాల మౌనిక, శ్రీపతి మెర్సీ, పచ్చి లక్ష్మి

రాజధాని రైతులపై కేసులను ఉపసంహరించాలి

- అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య తీర్మానం

గుంటూరు, జూన్ 21(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని రైతులపై ఉద్యమం సమయంలో పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించాలని అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య తీర్మానించింది. శుక్రవారం గుంటూరు నగరంలో సమాఖ్య సమావేశం మాదల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించి ప్రభుత్వానికి పంపించారు. ఎన్డీఏ పాలిత కేంద్ర ప్రభుత్వం నుంచి అమరావతి రాజధానికి అనేక రాయితీలను సాధించాలని, అలానే పెట్టుబడిదారులకు నమ్మకం కలిగించేలా కార్యకలాపాలు చేపట్టాలని మరో తీర్మానం చేసింది. సాధ్యమైనంత త్వరగా ఉమ్మడి వ్యూహాత్మక సమావేశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసి అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించాలని పేర్కొంది. అమరావతి రాజధాని ఉద్యమంలో అనేకమంది తమ ప్రాణాలను త్యాగం చేశారు. వారి త్యాగాలను చిరస్మరణీయం. అప్పటి ప్రభుత్వం పెట్టిన


అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య భేటీలో పాల్గొన్న నేతలు

నరకయాతనలతో రైతులు, ప్రజలు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. దీనిని తీవ్రంగా ఖండిస్తూ ఇంకొక తీర్మానాన్ని ఆమోదించింది. ఐటీపల జరిగిన ఎన్నికల్లో ఘనవిజయం సాధించినందుకు టీడీపీ పాలిత ఎన్డీఏ కూటమిని అభినందిస్తూ రాబోయే రోజుల్లో అమరావతి ప్రజానీకానికి మేలు చేకూర్చాలని తీర్మానం ఆమోదించింది. ఈ సమావేశంలో కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం

- మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి

గుంటూరు సిటీ, జూన్ 21: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి హామీ ఇచ్చారని సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన వివరాలు చేసిన పత్రికా ప్రకటనలో శుక్రవారం తాడేపల్లిలో మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించినట్లు తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగులపై వారి మాతృశాఖ మాత్రమే అజమాయిషీ ఉండేలా చూడాలని కోరామని పేర్కొన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పార్థ మధు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు తాతా వెంకట సాయి మణికంఠ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నవీన్, సంఘ ముఖ్య నాయకులు కోలేపు మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగ సంఘం నాయకులు

గడ్డి మందు తాగి కౌలురైతు ఆత్మహత్య

సత్తెనపల్లి రూరల్, జూన్ 21: అప్పుల బాధ తాళలేక కౌలు రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అబ్బూరులో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధూళిపాళ్ళ బ్రహ్మయ్య(45) పదిహేను సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తుంటాడు. ఎకరం సొంత పొలంతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని నాలుగు ఎకరాల్లో మిర్చి, రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. ప్రతి ఏడాదితో పాటు ఈ ఏడాదిలో కూడా పంటలు దెబ్బతినటంతో అప్పులు పెరిగి పోయాయి. సుమారు రూ.20 లక్షలు అప్పు కావటంతో అవి తీర్చే మార్గం లేక పోవటం, అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి తేవటంతో మనస్థాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తెల్లవారు జామున పొలం వెళ్లిన కుటుంబ సభ్యులకు బ్రహ్మయ్య అపస్మారక స్థితిలో పడటం గమనించి హుటాహుటిన సత్తెనపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ బ్రహ్మయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటన పై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బ్రహ్మయ్య (పాత చిత్రం)

చోరీ కేసుల్లో నిందితుడికి జైలు శిక్ష

నరసరావుపేట లీగల్, జూన్ 21: వేర్వేరు చోరీ కేసులు నిరూపణ అవ్వటంతో నిందితుడు ప్రకాశం జిల్లా బల్లికురవకు చెందిన షేక్ నాగూర్ బాషాకు మూడు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవలిక శుక్రవారం తీర్పు వెలువరించారు. కేసులు నమోదు చేసుకున్న మొదటి పట్టణ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి రెండు కేసుల్లో నిందితుడిగా నిర్ధారించి రిమాండ్‌కు తరలించారు. విచారణలో నేరాలు రుజువవటంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ లక్ష్మీరామ్ నాయక్ నిర్వహించారు.

మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ల సర్టిఫికెట్ల పరిశీలన

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో అధికారుల్లో కదలిక

గుంటూరు సిటీ, జూన్ 21: పక్క రాష్ట్రాల సర్టిఫికెట్లతో అక్రమంగా ప్రమోషన్లు పొందిన మునిసిపల్ ఇంజనీర్లకు సెగ తగులుతుంది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్‌లో 'మునిసిపాలిటీల్లో శంకర్‌దాదా' శీర్షికతో ప్రచురితమైన కథనం సంచలనం సృష్టిస్తోంది. 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన మునిసిపల్ శాఖ రాష్ట్ర అధికారులు మొత్తం వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. తక్షణం అందరి విద్యార్హతల సర్టిఫికెట్లు పరిశీలించాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. పక్క రాష్ట్రాలకు చెందిన సర్టిఫికెట్లతో ప్రమోషన్ పొందినవారి జాబితా తయారు చేయాలని సూచించినట్లు సమాచారం. ఏగ లాగితే డొంక కదిలినట్లు 2008నుంచి మునిసిపాలిటీల్లో జరిగిన అన్ని ప్రమోషన్లపై విచారణ జరగనుండటంతో కొందరు ఇంజనీర్లు హడలిపోతున్నారు. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన కొందరు అధికారుల మెడపై కూడా విచారణ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమోషన్లు ఇచ్చే సమయంలో ఉన్న అధికారుల మెడకు కూడా ఈ వ్యవహారం చుట్టుకునే అవకాశం కనిపిస్తోంది.

ఉన్నత విద్యామండలి వద్దన్నా..

వాస్తవానికి మునిసిపల్ ఇంజనీర్ల ప్రమోషన్ వ్యవహారంలో ఉన్నత విద్యా మండలి స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. పక్క రాష్ట్రాల నుంచి పొందిన డిగ్రీలు చెల్లుబాటు కావని స్పష్టంచేసింది. యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా వున్న యూనివర్సిటీల సర్టిఫికెట్లను విలువలేదని చెప్పినప్పటికీ మునిసిపల్ ఉన్నతాధికారులు వాటిని పట్టించుకోలేదు. జోన్-3 ప్రమోషన్ల ప్రక్రియలో ఉన్న తదుపరి మండలి ఆదేశాలను పూర్తిగా పక్కనపెట్టేసి నచ్చినవారికి అందలాలు కట్టబెట్టారు.

ఫైళ్లు ప్రారంభం

'ఆంధ్రజ్యోతి'కథనంతో ఇబ్బంది వస్తుందని పసిగట్టిన కొందరు అధికారులు అప్పుడే ఫైళ్లు ప్రారంభించారు. అధికారపార్టీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. బాధిత ఉద్యోగులు మాత్రం పక్క రాష్ట్రాల సర్టిఫికెట్లతో ప్రమోషన్లు పొందినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

యరపతినేనికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సన్మానం

పిడుగురాళ్ళ, జూన్21: గురజాల శాసనసభ్యునిగా నాల్గవసారి ఎన్నికైన యరపతినేని శ్రీనివాసరావును శుక్రవారం సాయంత్రం గుంటూరులోని ఆయన కార్యాలయంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కడప జిల్లా రాయచోటి శాసన సభ్యుడు, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం యరపతినేని కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. టికెట్ కేటాయింపులో యరపతినేని చొరవతోనే తనకు సీటు రావడం జరిగిందని ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి గుర్తుచేశారు. అనంతరం యరపతినేని శ్రీనివాసరావు కూడా మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సత్కరించారు.


గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును సన్మానిస్తున్న రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గుర్తు తెలియని యువకుడి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చిలకలూరిపేట, జూన్ 21: పట్టణంలోని మునిసిపాలిటీ రోడ్డులో కోర్టుకు సమీపంలో ఒక చెట్టు కింద గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా శుక్రవారం ఆ ప్రాంతంలోని కొందరు గుర్తించారు. వెంటనే వారు 108 అంబులెన్స్ వారికి ఈ విషయంపై సమాచారం అందించారు. అతడిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. అతడి వివరాలు తెలిసిన వారు చిలకలూరి పేట అర్బన్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. అతడికి సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండవచ్చునని బావి స్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాంట్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

48,825 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూన్ 21(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 43,236 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 48,825 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 12,490 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000
నెంబరు. 5	10000	15000
273	9000	16000
341	8500	16000
4884	13000	13000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	20000
బ్యాడిగి	9000	15500
దేవనూరుడీలక్స్	9000	15500

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
తెల్లకాయలు	4000	12500
ఏసీ కామన్ వెరైటీ		
334	8500	18000
273	9500	16000
341	10000	17000
4884	14000	18000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9500	20000
బ్యాడిగి	10000	15000
దేవనూరుడీలక్స్	11000	13000
తెల్లకాయలు	5000	12000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పెమ్మసానికి భారీ బైకు ర్యాలీతో స్వాగతం పలుకుతున్న దేగల ప్రభాకర్

పెమ్మసానికి దేగల ప్రభాకర్ ఘన స్వాగతం

గుంటూరు, జూన్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా గుంటూరు నగరానికి వచ్చిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ ఘనంగా స్వాగతం పలికారు. గుంటూరు నుంచి కాజ టోల్ గేట్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి పెమ్మసానికి పుష్పగుచ్ఛం ఇచ్చి హృదయ పూర్వక స్వాగతం పలికారు. కొత్తపేటలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రభాకర్ ఆధ్వర్యంలో సుమారు 1500 బైక్‌లు మరియు 500 కార్లతో గుంటూరు నుంచి పెద్ద సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ గుంటూరు పార్లమెంటులోఅత్యధిక మెజారిటీ సాధించిన ఘనత పెమ్మసాని చంద్రశేఖర్‌దే అని అన్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధికి నోచుకోని గుంటూరుని, జిల్లాని రానున్నరోజుల్లో పెమ్మసాని ఒక అద్భుత నగరంగా తీర్చుదిద్దుతారని అన్నారు.

● గుంటూరు 16వ డివిజన్ ఏటుకూరుకు చెందిన టీడీపీ నాయకులు దుగ్గిరాల మార్కండేయులు, ఆయన సోదరులు శుక్రవారం పెమ్మసాని చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను జీడిపప్పు మాలతో సన్మానించారు.

● కేంద్ర సహాయ మంత్రిగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పదవీ బాధ్యతల స్వీకరణ అనంతరం గుంటూరు రావడంతో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి శుభాకాంక్షలు తెలిపారు.



మొక్కను అందజేస్తున్న గళ్లా మాధవి

తాడిశెట్టి ఆధ్వర్యంలో భారీ కారు ర్యాలీ



పెమ్మసానికి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేస్తున్న తాడిశెట్టి మురళీమోహన్

గుంటూరు, జూన్ 21: తొలిసారిగా నగరానికి విచ్చేసిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తాడిశెట్టి మురళి మోహన్ ఆధ్వర్యంలో భారీ కారు ర్యాలీతో శుక్రవారం ఘన స్వాగతం పలికారు. పట్టాభిపురంలోని తాడిశెట్టి ఇంటి దగ్గర నుంచి పెద్ద ఎత్తున కార్లలో వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీగా వెళ్ళారు. అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు తాడిశెట్టి మురళి మోహన్ ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కూటమిలోని నేతలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జరిగిన ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి : కలెక్టర్

గుంటూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినియోగదారులకు సాధ్యమైనంత తక్కువ ధరలకు అందించేలా కూరగాయలు, నిత్యావసర సరుకులు రేట్ల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో టమాట, ఉల్లిపాయలు, ఇతర కూరగాయలు, నిత్యావసరాల సరుకులు లభ్యతతో పాటు ప్రస్తుతం మార్కెట్లో గల ధరలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల వల్ల టమాట పంట దిగుబడులు గణనీయంగా తగ్గడంతో వాటి ధరలు అధికంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రతి జిల్లాకు ఏర్పాటు చేసిన రూ.5 లక్షల రివాల్వింగ్ ఫండుతో మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా అధిక ధరలు గల కూరగాయలను తక్కువ ధరలకు లభ్యమయ్యే చోట కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా సేకరించిన ధరకే వినియోగదారులకు అందిస్తున్నదన్నారు. సమావేశంలో జేసీ రాజకుమారి గణియా, మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, ఉద్యాన శాఖ డీడీ రవీందర్, రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు, కమిటీ సభ్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, వినియోగదారుల సంక్షేమ సంఘాల ప్రతినిధి చదలవాడ హరిబాబు, హోల్ సేల్, రిటైల్ కూరగాయలు, రైస్, డాల్, అయిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్షిత నీటి సరఫరాకు పకడ్బందీగా చర్యలు

● సీఎస్‌కు నివేదించిన కలెక్టర్

గుంటూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సురక్షితమైన మంచినీరు సక్రమంగా సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు నివేదించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ నీరబ్ కుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు యంటి కృష్ణబాబు, అనిల్ కుమార్ సింఘాల్, ముఖ్య కార్యదర్శులు శశి భూషణ్ కుమార్‌తో కలసి సీజనల్, డయేరియా వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశమందిరం నుంచి పాల్గొన్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థలో గత అనుభవాలు దృష్ట్యా మంచినీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా నిరంతరం మున్సిపల్ అధికారులు పర్యవేక్షించటం జరుగుతున్నదన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మీ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ లక్ష్మీరాజ్యం, నగరపాలక సంస్థ ఎస్ఈ శ్యాంసుందర్, జిల్లా ప్రజా పరిషత్ డిప్యూటీ సీఈఓ మోహనరావు, అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ భారత్ కోసమే ఆదివాసుల బూటకపు ఎన్‌కౌంటర్‌లు

గుంటూరు(తూర్పు), జూన్ 21 : కార్పొరేట్ భారత్ కోసమే ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఆదివాసులను కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేస్తుందని విప్లవ రచయితల సంఘం సీనియర్ నాయకులు పాణీ అన్నారు. స్థానిక బ్రాడీపేట కొరటాల భవన్‌లో అఖిల భారత ప్రజా ప్రతిఘటన(ఎఐపిఆర్ఎఫ్) నాయకుడు దేవరపల్లి పున్నారావు 17వ సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. ఈ సభకు పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు జి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. పాణి మాట్లాడుతూ తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, పీడీఎం సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, జర్నలిస్ట్ ఎస్ఏ డేవిడ్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బస్సులపై కేసుల నమోదు

గుంటూరు(తూర్పు), జూన్ 21 : నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారులు నిర్వహిస్తున్న తనిఖీలు కొనసాగుతున్నాయి. తనిఖీల్లో భాగంగా పర్మిట్ కండిషన్ ఉల్లంఘించిన బస్సులపై 12 కేసులు నమోదు చేశారు. డీటీసీ కరీం మాట్లాడుతూ బస్సులపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

యోగాతోనే ఆరోగ్యకరమైన జీవితం

● భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ దుర్గారావ్



విజ్ఞాన్ వర్సిటీలో యోగా చేస్తున్న విద్యార్థులు

గుంటూరు(విద్య), జూన్ 21: ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఎంతో సహాయపడుతుందని ఏపీలోని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ డీ.దుర్గారావ్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 10వ ఇంటర్నేషనల్ యోగా డే నిర్వహించారు. 'యోగా ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు అడ్వకేట్ జీవీఆర్ క్రిష్ణ ప్రసాద్, ఇండస్ట్రియలిస్ట్ వీఆర్ శ్రీలక్ష్మి, యోగాసన స్పోర్ట్స్ స్టేట్ సెక్రటరీ పీ.ప్రేమ్ కుమార్, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ జి.సునీత మాట్లాడుతూ యోగాతో జీవితంలో ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో యోగ గురువు మధుసూధన్‌రెడ్డి, హార్ట్‌ఫుల్‌నెస్ జోనల్ హెడ్ రామకోటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలలో శ్వాస యోగాలో విద్యార్థులు

● సంపూర్ణ ఆరోగ్య జీవితానికి యోగా సాధన సులభ మార్గం అని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో యోగా గురువులు సీహెచ్ జగదీశ్, డి.మధురిక విద్యార్థులకు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి యోగా ఆవశ్యకత వివరించారు. కార్యక్రమంలో రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ఎన్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● స్థానిక టీజేపీఎస్ కళాశాలలో ప్రముఖ యోగ గురువు డాక్టర్ కె.కొండయ్య ఆధ్వర్యంలో 'నిత్య జీవితంలో యోగ పాత్ర' అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం, వైస్ ప్రిన్సిపాల్ ఏ.భానుమురళి, ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, ఆర్.జయ శైలజ, వ్యాయామ అధ్యాపకులు ఆర్.శివాజీ, విద్యార్థులు పాల్గొన్నారు

● స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ వై.రధిని చౌదరి మాట్లాడుతూ యోగాతో ఒత్తిడిని జయించవచ్చునని, నిత్యం యోగా చేయాలని విద్యార్థులకు సూచించారు.

● స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యోగ దినోత్సవం నిర్వహించారు. నేచురోపతి డాక్టర్ రాఘవి, యోగ శిక్షకురాలు లక్ష్మీ, నిధి వనం వ్యవస్థాపకులు శ్రీదేవి తదితరులు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన జీవనం కోసం యోగ ఎంతో దోహదపడుతుందన్నారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ బివి విజయభాస్కర్, కార్యదర్శి చేగు శ్రీధర్, ప్రిన్సిపల్ డాక్టర్ బి కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాధమాధవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం.గిరిజ, దీప్తి పాల్గొన్నారు.

● సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎ.శ్రీధర్, శ్రీలక్ష్మీ, ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు తదితరులు యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

● యోగా చేయడం వల్ల ఎన్నో లాభాలున్నాయని కళ్ళం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, యోగ ట్రైనర్ మాస్టర్ సాయి మనోహర్, ఎస్ సూర్యనారాయణ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ అసోసియేట్ ప్రొఫెసర్ దోరశిల శ్రీనివాసులు పాల్గొన్నారు.

● క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక సమతుల్యతను సాధించవచ్చని భాష్యం మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్ అన్నారు. మెయిన్ క్యాంపస్‌లో విద్యార్థినీ, విద్యార్థులు యోగాసనాలు వేసి యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు.

● శ్రీవేంకటేశ్వర బాలకుటీర్, చేతన, చౌడవరంలో పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.మంగాదేవి, చేతన కార్య నిర్వాహకురాలు మరుద్వతి, సీఏవో దుర్గా రఘురామ్, జయశ్రీ, ప్రిన్సి పల్స్ ఎండీ నస్రీన్, మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు), జూన్ 21 : స్థానిక బీఆర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్టెప్ సీఈవో బి.రాధిక మాట్లాడుతూ యాంత్రిక జీవితంలో ప్రతి వ్యక్తికి యోగా అత్యవసర మని అన్నారు. చీఫ్ కోచ్ నరసింహారెడ్డి, యోగా శిక్షకులు చలపతిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టెప్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.

● యోగాతో పొందే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యం గురించి అవగాహన పెంచడమే యోగా దినోత్సవ లక్ష్యమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. గుంటూరు బీజేపీ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బీజేపీ నగర అధ్యక్షుడు వనమా నరేంద్ర నిర్వహించారు.



యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, వనమా నరేంద్ర

● గుంటూరు, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో డీఆర్ఎం ఎం రామకృష్ణ, దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మహిళ సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు ఆశలత పాల్గొని అధికారులు, ఉద్యోగులతో కలిసి యోగా సాధన చేశారు. కార్యక్రమంలో యోగా ఉపాధ్యాయురాలు నందిత, రైల్వే సీనియర్ డీపీవో షేక్ షహబాజ్ హనూర్, డివిజనల్ సెక్యూరిటీ అధికారి కే సత్యహరప్రసాద్, పశ్చిమ డీఈఎన్ భారత్ పాల్గొన్నారు.

● గుంటూరు (మెడికల్) జూన్ 21 : నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత ప్రపంచ దేశాలు భారతీయ ప్రాచీన కళ యోగాకి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి జూన్ 21న అంతర్జాతీయ యోగా డేగా గుర్తింపు కల్పించినట్లు మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ తెలిపారు. కొత్తపేటలోని అహల్యా నర్సింగ్ హోమ్‌లో శుక్రవారం నిర్వహించిన యోగ డే వేడుకల్లో ఆమె ప్రసంగించారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా రోజంతా ఎంతో ఆహ్లాదంగా ఉంటుందని తెలిపారు. ప్రతి రోజూ అహల్యా నర్సింగ్ హోమ్‌లో గర్భిణీలు, రోగులతో యోగా అభ్యసనం చేయిస్తున్నట్లు డాక్టర్ శనక్కాయల అరుణ తెలిపారు. అనంతరం యోగాచార్యులు సహజానంద యోగి, మల్లికార్జున్ పర్యవేక్షణలో యోగా నిర్వహించారు.



సహజానంద యోగిని సన్మానిస్తున్న డాక్టర్ అరుణ

● గుంటూరు సిటీ,జూన్ 21: ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటమే కాకుండా శారీరక, మానసిక ధృడత్వానికి యోగా ఒక మంచి సాధనమని సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి పేర్కొన్నారు. శుక్రువారం ఉదయం స్థానిక ఎన్‌టిఆర్‌స్టేడియంలో ఆయుష్ శాఖ చే ఏర్పాటు చేసిన 10వ అంతర్జాతీయ యోగా డే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. యోగాను ప్రతి ఒక్కరు ప్రతిరోజు ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో పి శ్రీకర్, డిఎంహెచ్‌ఓ డా విజయలక్ష్మీ, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రాజేశ్వరి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఆయూష్ శాఖ సీనియర్ మెడికల్ అధికారిణి డా.స్వర్ణ కుమారి, మెడికల్ అధికారులు, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్లు నగేష్, రవీంద్ర రెడ్డి, వివిధ నర్సింగ్ విద్యార్థినీలు, వివిధ కాలేజీల విద్యార్థినీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. యోగా కోచ్ సాంబశివరావు సరాసరి ఒక గంట పాటు యోగాను అందరితో చేయించారు.



ఎన్టీఆర్‌స్టేడియంలో యోగాసనాలు వేస్తున్న జేసీ రాజకుమారి తదితరులు

● గుంటూరు, జూన్ 21 : నగరంలోని జిల్లా కారాగారంలో ఆర్ట్ అఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో రిమాండ్, శిక్షా ముద్దయిలకు యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్ట్ అఫ్ లివింగ్ సంస్థ అధ్యాపకులు తన్నీరు వినయ్, పర్వి ప్రసాద్ యోగా ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ కె. రఘు, జైలర్లు బి. తేజేశ్వర్ రావు, సి. హెచ్. కిరణ్, డిప్యూటీ జైలర్ కట్టా. అశోక్, బి. శ్రీనివాసరావు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీజీపీకి హైస్కూల్ మిత్రుల అభినందనలు

గుంటూరు, జూన్ 21 : ఆంధ్రప్రదేశ్ కొత్త డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ద్వారకా తిరుమలరావును పలువురు హైస్కూల్‌లో కలిసి చదువుకున్న స్నేహితులు అభినందనలు తెలిపారు. లక్ష్మీపురంలో ఉన్న పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో 1975-79 సంవత్సరంలో పదో తరగతి వరకు ద్వారకా తిరుమలరావుతో కలిసి చదువుకున్న గుమ్మడి రమేష్‌కుమార్, ప్రముఖ హోమియో వైద్యులు ఓపీ రమణ, నాగమల్లేశ్వరరావు, గుమ్మడి సుబ్బారావు, వాసుదేవరెడ్డి, జమీన్, రఘు తదితరులు మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో తిరుమలరావును కలిసి స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావుతో స్నేహితులు

ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక ఓపీ రూమ్

గుంటూరు (మెడికల్), జూన్ 21 : ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక ఓపీ విభాగం ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఆసుపత్రిలోని నాట్కో భవనంలో వాలంటరీ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రైడ్ మంత్‌లో భాగంగా ట్రాన్స్‌జెండర్లకు నిర్వహించిన ఉచిత వైద్య సలహా శిబిరంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ ఎన్ ఉమాజ్యోతి, డాక్టర్ సుమితా శంకర్, వీహెచ్ఎస్ రీజనల్ కోఆర్డినేటర డాక్టర్ అపర్ణ, డాక్టర్ చంద్రశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు

గుంటూరు(తూర్పు), జూన్ 21 : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో శుక్రవారం భగవద్గీతలోని జ్ఞాన విజ్ఞానయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారంతో ముగిసాయి. తొలుత ఆలయ కమిటి అధ్యక్షులు మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ పాలకవర్గం సుధీరానందస్వామిని ఘనంగా సత్కరించారు.

చిన్నారి హితైషి చికిత్స కోసం వితరణ

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి దాత స్పందన

గుంటూరు, జూన్ 21: అరుదైన ప్రాణాంతక వ్యాధి స్పైనల్ మస్కులర్ అట్రోఫి (ఎస్ఎమ్ఎ) తో బాధపడుతున్న చిన్నారి హితైషి చికిత్స కోసం సహాయం చేసేందుకు దాతలు ముందుకొస్తున్నారు. 'చిన్నారి ప్రాణం ఖరీదు రూ. 16 కోట్లు' అనే శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి గుంటూరులో భారత పొగాకు బోర్డులో పని చేసిన విశ్రాంత అధికారి రావెళ్ళ లక్ష్మయ్య స్పందించారు. నగరంలోని గుజ్జనగుండ్లకు చెందిన లక్ష్మయ్య బాధితుల బ్యాంక్ అకౌంట్‌లో రూ.10వేలు జమ చేసినట్లు తెలిపారు. పాపకు చికిత్స అందుబాటులో ఉందని, జోల్ జెన్‌స్మా ఇంజెక్షన్‌కు రూ.16 కోట్లు ఖర్చవుతుందని, దాతలు స్పందించి తోచిన సహాయం చేయాలని, ప్రభుత్వం కూడా స్పందించి చిన్నారి పాపకు ప్రాణం పోయాలని లక్ష్మయ్య కోరారు.

వృద్ధురాలి మెడలో గొలుసు తెంచుకెళ్లిన మహిళ

గుంటూరు, జూన్ 21 : పట్టపగలు రద్దీగా ఉండే చౌత్రా సెంటర్లో ఓ వృద్ధురాలి మెడలో గొలుసు తెంచుకెళ్ళిన మహిళా చైన్‌స్నాచర్ ఉదంతం తీవ్ర కలకలం రేపింది. లాలాపేట పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చౌత్ర సెంటర్‌కు చెందిన శేషారత్నం (71) శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఇంటి ముందు కూర్చుంది. అదే సమయంలో ఓ మహిళ వృద్ధురాలి మెడలోని మూడు సవర్ల బంగారు ఆభరణాల గొలుసును తెంచుకొని ఉడాయించింది. వృద్ధురాలు కేకలు వేసినప్పటికీ స్థానికులు వచ్చేలోగానే ఆ మహిళ పారిపోయింది. లాలాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం చొరవ చూపాలి

గుంటూరు(తూర్పు), జూన్ 21 : గత ఐదేళ్లగా పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలపై నూతన ప్రభుత్వం చొరవ చూపాలని ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు పి.కేశవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మెడికల్ కళాశాల ఆవరణలోని పెన్షనర్ల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం డిఎ, పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. నెట్‌వర్క్ ఆస్పత్రిల్లో నగదు రహిత వైద్య సేవలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ సభ్యులు సైదులు, వెంకటేశ్వరరావు, రామారావు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జూన్21: స్థానిక ఎస్‌వీఎన్ కాలనీలోని శ్రీ పద్మావతి గోదాసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి ద్వావింశతి (22వ) వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 24వ తేదీ వరకు బ్రహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి ఉదయం విశేష పూజలు, అనంతరం చండీ హోమం, లలిత సహస్రనామం, సాయంత్రం స్వామి వారికి దివ్య కళ్యాణమహోత్సం జరుగు తాయని వారు వివరించారు.



కేక్ కట్ చేస్తున్న తులసీ రామచంద్రప్రభు, పక్కన కృష్ణచైతన్య, యోగీష్ తదితరులు

ఘనంగా రామచంద్రప్రభు, కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు

గుంటూరు, జూన్ 21: ప్రముఖ పారిశ్రామికవేత్త, తులసీ గ్రూపు సంస్థల చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, అయన తనయుడు తులసి కృష్ణచైతన్యల జన్మదిన వేడుకలు శుక్రవారం రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగాయి. అరండల్‌పేటలోని యోగిభవన్‌లో తమ కుమారులు తులసి యోగీష్, తులసి కృష్ణ చైతన్య, మనవడు తులసి ఆదిత్య సమక్షంలో భారీ కేక్‌ను రామచంద్రప్రభు కట్ చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రభుకు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ఆత్మీయుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డీఏ కూటమితోమూడవసారి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు అయన అభినందనలు తెలిపారు. అనంతరం బాటసారులకు 'తులసి' ఉద్యోగుల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఏటుకూరు మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య ఆధ్వర్యంలో ఉద్యోగులకు, అభిమానులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణయ్య, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, వ్యాపారవేత్త మలిశెట్టి సుబ్బారావు, సుప్రీమ్ సర్జికల్స్ జవహర్, కార్పొరేటర్లు పోతురాజు సమత, యర్రంశెట్టి పద్మావతి, దాసరి లక్ష్మి దుర్గ, వాసు, మాదా రాధ, తోటకూర సుబ్బారావు, దళవాయి సుబ్రహ్మణ్యం, కనకం నరసింహారావు, తోట శ్రీనివాస్, తిరుమలశెట్టి రమేష్, ఉగ్గిరాల సీతారామయ్య మిత్రమండలి, వీరబాబు, బొల్లిముంత కృష్ణార్జునరావు, అప్పిశెట్టి రంగారావు, స్టే రమేష్, ఉగ్గిరాల రాజా, ఉగ్గిరాల కోటేశ్వరరావు, వివేకానంద శ్రీనివాసరెడ్డి, రామ్మోహనరావు, వేరుకొండ వెంకటరమణ, సైదులు రావు నాయుడు, రమణయ్య, అంజనేయులు, షేక్ ఖాసీం, ఊచా సాంబశివరావు, బిల్లూరి బాజీ, బర్మా ప్రసాద్, మామిడాల రాజేష్, జవ్వాది శ్రీకాంత్, డాక్టర్ చందు అజయ్, దాసరి రవి, అంకమ్మరావు గురూజీ, ఈమని మాధవరెడ్డి పలువురు నాయకులు రామచంద్రప్రభుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏపీఈఏపీసెట్‌లో శ్రీదివ్య విద్యార్థులకు ర్యాంకులు

గుంటూరు(విద్య), జూన్ 21: ఇటీవల ప్రకటించిన ఏపీ ఈఏపీసెట్ ఫలితాలలో శ్రీ దివ్య ఇనిస్టిట్యూషన్స్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ చిత్రి రాము శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేట 2/3లోని కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందిన విద్యార్థులలో వి.వి. ఎ.ఎస్. సూర్య 2154 ర్యాంకు సాధించాడని తెలిపారు. అదేవిధంగా 10 వేల లోపు ముగ్గురు విద్యార్థులు, 20 వేల లోపు ఐదుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ రాము

విద్యావంతులైన బాలలతో మెరుగైన సమాజం

గుంటూరు, జూన్ 21 : విద్యావంతులైన బాలలతో మెరుగైన సమాజం ఏర్పడుతుందని కెఎస్ఆర్‌టీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి రాంబాబు అన్నారు. నగరంలోని 21వ డివిజన్ పరిధిలోని కొండా వెంకటప్పయ్య కాలనీలో చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక మాసం పురస్కరించుకొని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ఆడియో ప్రకటన ద్వారా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాలలను బాగా చదివించాలని, తల్లిదండ్రులకు బాలలందరినీ స్కూలుకి పంపించే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. క్రాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్ జి.వెంకట్ మాట్లాడుతూ బాల కార్మికత్వాన్ని అంతం చేయడం అందరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కేఎస్ఆర్‌టీ మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు థామస్ రెడ్డి, అంగన్వాడి వర్కర్స్ సులోచన, విలాసిని, బాలలు పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమి వేడుకలు

గుంటూరు(తూర్పు), జూన్ 21 : సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని గుంటూరు రూరల్ మండల వ్యవసాయాధికారి ఐ.సుబ్రహ్మణ్యం అన్నారు. జొన్నలగడ్డ గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యం ఏరువాక సాగులో పాల్గొని భూమి పూజ నిర్వహించి, నవ ధాన్యాలు పొలంలో చల్లారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నామా శ్రీనివాసరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

గుంటూరు(తూర్పు), జూన్ 21 : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు, గుంటూరు జిల్లా విజిలెన్స్ ఎస్పీ దంపతులు పూజలు నిర్వహించారు.

కోర్ బ్రాంచెస్‌లో బెస్ట్ సివిల్ ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్ అన్నట్లుగా రోజులు మారాయి. నిజానికి కోర్ ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ లేదు. ఇంజనీరింగ్ మూలపుటమ్మలుగా ప్రసిద్ధి చెందిన మూడింటిలో సివిల్ ఒకటి కాగా మెకానికల్, ఎలక్ట్రికల్ తతిమా రెండూ. ఇప్పుడు ఉన్న ఇంజనీరింగ్ బ్రాంచ్‌లన్నింటికీ మాతృకలు ఇవే. అయితే కంప్యూటర్ మోజులో ప్రపంచవ్యాప్తంగా చాన్నాళ్ళుగా సివిల్ ఇంజనీరింగ్‌కు ఆదరణ బాగా తగ్గింది. ఆ నేపథ్యంలో సదరు డిసిప్లిన్ అవసరాన్ని, అవకాశాలను **రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు** తార్కికంగా వివరించారు.



భౌతికంగా లేదంటే సహజంగా ఏర్పాటైన కట్టడాల డిజైన్, నిర్మాణం, నిర్వహణ కలగలిసిన వృత్తిపరమైన డిసిప్లిన్ సివిల్ ఇంజనీరింగ్. పబ్లిక్ వర్క్స్ అంటే రహదారులు, వంతెనలు, కాల్వలు, డ్యామ్‌లు, ఎయిర్‌పోర్టులు, మురుగునీటి వ్యవస్థలు, పైప్‌లైన్‌లు, భవనాలకు సంబంధించిన స్ట్రక్చరల్ కాంపోనెంట్స్, రైల్వేలు, వాటర్ సప్లయ్, ఇండస్ట్రియల్ ప్రాజెక్టులు, నివాస గృహాలు సహా భూమి, నీరు, పర్యావణం, సివిలైజైషన్ అలాగే సంబంధిత ప్రాసెసస్‌కు సంబంధించినవన్నీ సివిల్ ఇంజనీరింగ్‌లోకే వస్తాయి.

రిలేటెడ్ బ్రాంచ్‌లు

సివిల్(కన్‌స్ట్రక్షన్), సివిల్(పబ్లిక్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్) ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ రూరల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్(కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ), సివిల్ ఇంజనీరింగ్(ఎన్విరాన్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్), సివిల్ ఇంజనీరింగ్(పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్), సివిల్ ఇంజనీరింగ్(రూరల్ ఇంజనీరింగ్), సివిల్ టెక్నాలజీకి తోడు ప్లానింగ్, ఆర్కిటెక్చర్‌కు అందులోని ఉప విభాగాలకూ ఇదే మాతృక.



కౌన్సెలింగ్ గైడెన్స్

అవకాశాలు

ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో సివిల్ ఇంజనీర్లకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వ అంటే మున్సిపల్ కార్పొరేషన్స్, వాటర్ బోర్డులు, ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ, న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, మెట్రోరైల్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, రైల్వేస్, ఇరిగేషన్ అండ్ ఫుడ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, నేషనల్ హైడ్రో-ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్, డిఫెన్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, ఆర్‌ఐటీఈఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు, వివిధ సంస్థలకు చెందిన బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ విభాగాలు సహా ఈ జాబితాకు అంతు లేదు. అలాగే అసిస్టెంట్, ఇంజనీర్, అసిసెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ వంటి ఉద్యోగాలు ప్రభుత్వ సంస్థల్లో ఉంటాయి.

- అదే ప్రైవేట్ సెక్టర్‌లోకి వస్తే ట్రైనీ ఇంజనీర్‌తో మొదలై చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరకు వేర్వేరు హోదాల్లో ఉద్యోగాలు ఉంటాయి. కన్‌స్ట్రక్షన్, డిజైన్ విభాగాల్లో సివిల్ ఇంజనీర్ సేవలు అవసరమవుతాయి. కాడ్(సీఏడీ) సాఫ్ట్‌వేర్‌పై పరిజ్ఞానానికి తోడు ఫైనైట్ ఎలిమెంట్ అనాల్సిస్ అలాగే అవసరమైన నైపుణ్యాలను అలవర్చుకుంటే ప్రైవేటు సంస్థల్లో ఎదుగుదలకు ఢోకా ఉండదు. ఆరంభంలో రెండున్నర నుంచి మూడున్నర లక్షల రూపాయల మేర వార్షిక ప్యాకేజ్ ఉంటుంది. ప్రైవేటు రంగంలో ముఖ్యంగా ఎల్ అండ్ టి మొదలుకుని టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్, గ్యామన్ ఇండియా, గ్యామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, ఒమెక్స్, సూపర్‌టెక్, షాపూర్‌జి అండ్ పల్లోంజి గ్రూప్, జీఎంఆర్ గ్రూప్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అశోకా బిల్డ్‌కాన్, బిఎల్ కాష్యప్ అండ్ సన్స్ లిమిటెడ్, కన్సాలిడేటెడ్ కన్‌స్ట్రక్షన్ కన్సార్టియం లిమిటెడ్, ఎస్సార్ గ్రూప్, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, జేపీ గ్రూప్, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, పుంజ్ లాయిడ్ తదితరాలు అతి పెద్ద కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో కొన్ని మాత్రమే.

అవసరం

సివిల్ ఇంజనీరింగ్ విషయంలో ప్రమోషన్ కార్యకలాపాలు చాలా అవసరం, కీలకం కూడా. కన్‌స్ట్రక్షన్ పరిశ్రమ, సంబంధిత సంస్థలు, వ్యవస్థలు అలాగే మీడియా ఇందుకు చేతులు కలపాల్సిన అవసరం ఉంది. రెగ్యులేటరీ వ్యవస్థలు, ప్రొఫెషనల్ సంస్థలతో కూడా కలిసి పనిచేయాలి. పే ప్యాకేజ్‌తో మొదలుపెట్టి కరికులమ్‌లో ఇండస్ట్రీ నిర్దేశిత థియరటికల్ కాన్సెప్ట్స్, నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలి. అన్నింటికీ మించి అటు ఇండస్ట్రీ ఇటు విద్యా సంస్థలు చేతులు కలపాలి. వివిధ ఇంజనీరింగ్ విభాగాల మధ్య విద్యా సంస్థల్లో సీట్లు - భర్తీ విషయంలోనూ శాస్త్రీయ విధానాన్ని అమలు చేయాలి. ఒక జాబ్‌కు ఉన్న డిమాండ్, వేకెన్సీలను దృష్టిలో పెట్టుకుని ఇదంతా జరిగితే ఇంజనీరింగ్ విద్యావ్య వస్థలో మంచి రోజులు రావడమే కాదు, ఫలితాలూ బాగుంటాయి.

DIKSUCHI దిక్సూచి

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్టుకు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్రం ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్&నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.

క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్‌ఎల్‌ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.

- **కోర్సు ఫీజు:** రూ.25,000
- **అడ్మిషన్ ఫీజు:** రూ.1000
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 31
- **ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** ఆగస్టు 1 నుంచి 7 వరకు
- **అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 17
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 20 నుంచి
- **ప్రోగ్రామ్‌ల ముగింపు:** 2025 ఫిబ్రవరి 19న
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

పీజేటీఎస్‌ఏయూలో యూజీ ఎన్‌ఆర్‌ఐ కోటా

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్‌ఏయూ)-ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. విదేశాల్లో నివశిస్తున్న ఎన్ఆర్ఐ అభ్యర్థులు, ఎన్ఆర్ఐలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్(ఇంటర్/పన్నెండోతరగతి మార్కులు) ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు రూ.9,53,450లకు డీడీ, రూ.46,550ల నగదుతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. వీరికి ఫీ రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ రాయితీలు లభించవు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.

- **బీటెక్ స్పెషలైజేషన్‌లు:** ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- **బీఎస్సీ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్

బైపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్‌లో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ 10 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

ఎంపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) 3 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: బైపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు(ఇండియన్/విదేశీ బోర్డు) నుంచి బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే ఏదేని ఇండియన్/విదేశీ బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ప్రాసెసింగ్ ఫీజు:** రూ.5,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

నీలిట్‌లో డిప్లొమా, డిగ్రీ, పీజీ

అగర్తలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఇంజనీరింగ్ డిప్లొమా, బీసీఏ, ఎమ్మెస్సీ(ఐటీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 35 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీసీఏ(బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్): ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: మేథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులలో ఏవేని రెండు సబ్జెక్టులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు; మూడేళ్ల వ్యవధి గల ఏదేని ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ(ఐటీ): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ(ఐటీ/సీఎస్)/బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథ్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తో పాటు బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి లిస్ట్ విడుదల:** జూలై 4న
- **వెబ్‌సైట్:** nielitagtadmission.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/w3c3dM3లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

పీరియాడిక్ యాక్షన్ డ్రామా



'విరుపాక్ష', 'బ్రో' చిత్రాల తర్వాత సాయిదుర్గ తేజ్ నటిస్తున్న కొత్త చిత్రం షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. చుట్టూ ల్యాండ్ మైన్లు, మధ్యలో ఎడారి భూమిలో ఓ పచ్చని చెట్టు.. ఉన్న ఈ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఓ యూనివర్సల్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుందని పోస్టర్ చూడగానే అర్థమవుతుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'గ్రాండ్ స్కేల్‌లో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరో సాయి పాత్ర చాలా శక్తిమంతంగా ఉంటుంది. ప్రత్యేకంగా రూపొందించిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తాం' అని చెప్పారు.

మా ఊరు శ్రీకాకుళం..



'వెన్నెల' కిశోర్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమాలోని 'మా ఊరు శ్రీకాకుళం' పాటను దర్శకుడు హరీశ్ శంకర్ విడుదల చేశారు. శ్రీకాకుళం గొప్పతనం వివరిస్తూ రామజోగయ్య శాస్త్రి రాసిన పాటను మంగ్లీ పాడారు. సునీల్ కశ్యప్ స్వరపరిచారు. ఈ సందర్భంగా హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమా టైటిల్ ఫన్నీగా ఉంది. మోహన్ రచయితగా నాకు చాలా కాలం నుంచి తెలుసు. పాట విజువల్స్ బాగున్నాయి. మంగ్లీ బాగా పాడింది. వెన్నెల కిశోర్ నుంచి ఒక డిఫరెంట్ సినిమా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నా' అన్నారు. ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, ఫొటోగ్రఫీ: మల్లికార్జున్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజేశ్ రామ్, సమర్పణ: లాస్య రెడ్డి.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా



తమిళ అగ్రహీరోలు రజనీకాంత్, కమల్ హాసన్ యాక్షన్ బాట పట్టారు. 'విక్రమ్', 'జైలర్' చిత్రాలతో వీరిద్దరూ తమిళంలోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో సంచలన విజయాలు అందుకున్నారు. దీంతో తదుపరి చిత్రాలు కూడా ఇదే జానర్లో చేస్తున్నారు. మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ 'థగ్‌లైఫ్' కూడా యాక్షన్ ప్యాక్డ్‌గా ఉండబోతోంది. అలాగే శంకర్ దర్శకత్వంలో వస్తున్న 'భారతీయుడు 2' చిత్రంలో పోరాట ఘట్టాలపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. 'జైలర్' ఊపులో రజనీకాంత్ సైతం ఇలాంటి చిత్రాలకు పెద్ద పీట వేస్తున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ జ్ఞానవేల్ రాజా దర్శకుడు ఇందులో రజనీకాంత్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. చిత్రీకరణ చివరి దశలో ఉంది. 'వేట్టయాన్' తర్వాత రజనీకాంత్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రం చేస్తున్నారు. అయితే రజనీకాంత్ ఈ సినిమాలో కూడా ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గానే కనిపించనున్నారని కోలీవుడ్ టాక్. మానవ అక్రమ రవాణాను అడ్డుకునే నిజాయితీపరుడైన పోలీస్ ఆఫీసర్‌గా, క్రిమినల్స్‌ను ఏరివేసేందుకు ఎంతకైనా తెగించే ఖాకీగా ఆయన శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారట.



రివర్స్ లవ్‌స్టోరీ

ఆంగ్లంలో 'లవ్' అనే నాలుగు అక్షరాలను రివర్స్ చేస్తే 'ఈవోల్' అని వస్తుంది. ఆ టైటిల్‌తో ఓ రివర్స్ లవ్‌స్టోరీ వస్తోంది. సూర్య శ్రీనివాస్, శివ బొడ్డురాజు హీరోలుగా, జెన్నిఫర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో దర్శకనిర్మాత రామ్ యోగి వెలగపూడి శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ 'ఇద్దరు స్నేహితుల మధ్య కుదిరిన అవగాహన నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. వాణిజ్య విలువలతో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించాను. హైదరాబాద్, వైజాగ్‌లో షూటింగ్ జరిగింది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, ఫొటోగ్రఫీ: తేడా బ్యాచ్ సినిమా టీమ్, ఎడిటింగ్: విజయ్.

ఈసారి కూడా ఓటమి లేదు



'ఇప్పటిదాకా ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు, ఈ సారి కూడా ఓడిపోను, బాగా ప్రిపేరయ్యి వచ్చాను... చూసుకుందాం రా' అంటూ ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నారు ప్రభాస్. భారతీయ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ' చిత్రం కోసం ప్రభాస్ చెప్పిన డైలాగ్ ఇది. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం చిత్రబృందం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా డేరింగ్ స్టంట్స్ చేశారు. కమల్‌హాసన్ పూర్తిగా సరికొత్త లుక్‌లో ఆశ్చర్యపరిచారు. బుజ్జితో కలసి ప్రభాస్ చేసిన సాహసాలు, పోరాట ఘట్టాల్లో దిశా పటానీ మెరుపులతో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రభాస్, దీపికా పదుకొనే జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకుడు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతం



ఇటీవలే ముంబైలో 'కల్కి' చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అమితాబ్ బచ్చన్ నిర్మాత సి. అశ్వనీదత్ పాదాలకు నమస్కరించబోగా, ఆయన సున్నితంగా వారించారు. ఆ తర్వాత అమితాబ్ పాదాలకు అశ్వనీదత్ నమస్కరించారు. అమితాబ్ లాంటి దిగ్గజ నటుడు తన వయసు, స్టార్‌డమ్‌ను పక్కనపెట్టి నిర్మాతకు ఎంతో గౌరవం ఇస్తూ పాదాభివందనం చేయడం ఆయన సంస్కారం, గొప్ప మనసుకు నిదర్శనం అని నెటిజన్లు కొనియాడారు. ఆ సంఘటనపై నిర్మాత అశ్వనీదత్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అసలు అమితాబ్ ఆ రోజు ఈవెంట్‌లో అలా చేస్తారని తాను ఊహించలేదని చెప్పారు. 'నేను తేరుకొని ఆయనకు ప్రతి నమస్కారం చేయడానికి కొంచెం సమయం పట్టింది. అమితాబ్‌బచ్చన్ భారతీయ సినిమా యోధుడు ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వానికి మరోసారి అభివందనం చేస్తున్నాన'ని తెలిపారు.

బుజ్జిమేక.. బుజ్జిమేక



గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'పొట్టేల్'. యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ముఖ్య పాత్రధారులు. సాహిత్ మోత్కూరి దర్శకుడు. ఇప్పటి వరకూ విడుదలైన మూడు పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి. తాజాగా నాలుగో పాటను శుక్రవారం విడుదల చేశారు. 'బుజ్జి మేక.. బుజ్జిమేక' అంటూ సాగే ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, కాలభైరవ పాడారు. శేఖర్‌చంద్ర స్వర పరిచారు. పాటలో విజువల్స్ ఆకట్టుకొనేరీతిలో ఉన్నాయి. హార్ట్ టచింగ్ సాంగ్‌గా దర్శకుడు చిత్రీకరించారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ నడిగే నిర్మాతలు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/DiKTPSo లో చదవండి.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

తాగునీటి సరఫరాలో అంతరాయం

తెనాలి, మారీసుపేట జూన్ 21: పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో అందిస్తున్న తాగునీటి సరఫరా పైపుల మరమ్మతుల కారణంగా రెండు రోజులు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శేషన్న తెలిపిన వివరాల ప్రకారం వీఎస్ఆర్ కళాశాల రోడ్డులో పైకస్ పార్క్ వద్ద గల నాలుగు పాత ఎయిర్ వాల్వ్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందువలన పట్టణంలో 22, 23 తేదీలలో గాంధీ ఇర్విన్ పార్క్‌లోని ఇఎల్ఎస్ఆర్ ట్యాంకుల పరిధిలోని 3వ వార్డు నుంచి 10వ వార్డు వరకు అనగా సిద్ధార్థ కాలనీ, కవిరాజా పార్క్ ఏరియా నందులపేట, గాంధీనగర్, బీసీ కాలనీ కొత్తపేట, నాజరుపేట ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.



స్వామివారికి ప్రతేక పూజలు నిర్వహిస్తున్న బాలస్వామి తదితరులు

శాంతి హోమంలో తిరుమంజనం సేవలు

తెనాలి, మారీసుపేట జూన్ 21: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలోని సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) పర్యవేక్షణలో నవగ్రహ సహిత శ్రీనక్షత్ర సంపూర్ణ శాంతి హోమ పూజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం 9వ రోజు జ్యేష్ఠ నక్షత్రం వారిచే గణపతిపూజ, రుద్రాభిషేకాలు, గణపతి హోమం, నవగ్రహ హోమం, శ్రీమహామృత్యుంజయ హోమంను యల్లాప్రగడ పవన్‌కుమార్‌శర్మ ఋత్వికులచే యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ములుకుట్ల విశ్వనాథశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. సాయంత్రం శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వార్లకు తిరుమంజనం సేవలను నిర్వహించారు. స్వామి వారికి గోవింద నామార్చన, విశేష ద్రవ్యములతో తిరుమంజనం, విశేష హారతులను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, పెనుగొండ వెంకటేశ్వరావు, జాయింట్ సెక్రటరీ ముద్దభక్తుని రమణయ్య ఉప్పల విశ్వనాధం, రావూరి సుబ్బారావు, ఏలూరి రాజేశ్వరరావు, గోపు రామకృష్ణ, కోన నాగేశ్వరావు, చుండూరు లోకనాధం, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి మనిషి ధర్మాన్ని ఆచరించాలి

● తెనాలి మార్కెట్ యార్డులో చాగంటి ప్రవచనం

తెనాలి అర్బన్, జూన్ 21: ప్రతి మనిషి ధర్మాన్ని ఆచరిస్తే సమాజంలో శాంతి, సౌభాగ్యం వెల్లివిరుస్తుందని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం రాత్రి వేలాదిమంది భక్తులకు శ్రీరామనామం, హనుమాన్ చాలీసా పారాయణ విశిష్టతపై ప్రవచనం చేశారు. పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తనా బృందం, సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవచనానికి విచ్చేసిన చాగంటికి వేద మంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం చాగంటిని సంకీర్తనా బృందాల సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆర్వి కిరణ్‌కుమార్, మూర్తి వెంకటేశ్వరరావు, అనురాధ, మాజేటి వెంకటేష్, బాలకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.



ప్రవచనం ఇస్తున్న చాగంటి

కేంద్ర సహాయమంత్రి పెమ్మసానికి సత్కారం

తెనాలి రూరల్, జూన్ 21: మాతృభూమిపై ఉన్న మమకారంతో మంచి చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి నేడు కేంద్రసహాయ మంత్రిగా మన ముందుకు పెమ్మసాని చంద్రశేఖర్ రావడం గర్వకారణంగా ఉందని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి అన్నారు. శుక్రవారం గుంటూరులో కేంద్రసహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు వీరవల్లిమురళి, అంగలకుదురు గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, వారి మిత్రబృందం మర్యాదపూర్వకంగా కలిసి బాదంపప్పుల దండను పెమ్మసానికి వేసి దుశాలువాలతో ఆయనను సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వీరవల్లి మురళి మాట్లాడుతూ యువత భవిష్యత్తును చిత్తుచేస్తున్న గంజాయిపై ఉక్కుపాదం మోపేలా సంబంధిత శాఖలను పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారని ఆయన చొరవతోనే గంజాయిపై దాడులు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో గుంటూరు పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధివైపు పరుగులెడతాయని వీరవల్లి మురళి స్పష్టం చేశారు. షేక్ సలాం, నిజాం ఉద్దీన్, కంచర్లమురళి, పలువురు గణేష్‌యూత్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను బాదం పప్పుల దండతో సత్కరిస్తున్న వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం తదితరులు



కొలకలూరులో గ్రామదేవత ఆలయం చుట్టూ ఎద్దులతో ప్రదక్షిణ చేస్తున్న రైతులు

ఘనంగా ఏరువాక పౌర్ణమి

తెనాలి రూరల్, జూన్ 21: ఏరువాక పౌర్ణమిని శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఘనంగా జరుపుకున్నారు. వ్యవసాయానికి ప్రధాన భూమిక గా ఉన్న ఎద్దులను, ట్రాక్టర్లను, వ్యవసాయ పనిముట్లను శుభ్రంగా కడిగి పసుపు కుంకుమలు, పూలతో వాటిని అందంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని గ్రామ దేవత ఆలయాలకు వచ్చి ఎద్దులను, ట్రాక్టర్లను చుట్టూ ప్రదక్షణలు చేయించి అమ్మవారిని వేడుకున్నారు. వ్యవసాయంపైనే ఆదారపడిన తమకు సకాలంలో వర్షాలు కురిసి చీడపీడల బాధలేకుండా పంటలు సమృద్ధిగా పండి తమ ఇంట సిరులు కురవాలని రైతులు కుటుంబసమేతంగా గ్రామదేవలకు ప్రత్యేక పూజలు జరిపి వేడుకున్నారు. మండలంలోని కొలకలూరులో రైతులు ఏరువాక పౌర్ణమి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమితో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

నేడు నందివెలుగులో రుద్రయాగం

తెనాలి రూరల్, జూన్ 21: మండలంలోని నందివెలుగులో మహర్షి దయానంద వృద్ధాశ్రమంలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని రుద్రయాగం జరుపుతున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు కూరపాటి కళ్యాణి, రవీంద్రనాథ్‌లు తెలిపారు. ఉదయం 10 గంటలకు రుద్రయాగం ప్రారంభమవుతుందని, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఆరోసారి ఎమ్మెల్యేగా ధూళిపాళ్ళ ప్రమాణం

పొన్నూరు టౌన్, జూన్ 21: పొన్నూరు నియోజకవర్గ శాసన సభ్యుడిగా ఆరోసారి ధూళిపాళ్ళ నరంద్ర కుమార్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి వారసుడిగా రాజకీయాలలోకి అడుగుపెట్టిన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మూడు దశాబ్దాల పాటు పొన్నూరు నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చారు. గత ఎన్నికల సమయంలో స్వల్ప తేడాతో ఓటమి చెందిన నరేంద్ర కుమార్ ఐదేళ్లకాలంగా ఎన్నో ఆటుపోట్లను వైసీపీ నుంచి ఎదుర్కొన్నారు. నియోజకవర్గాన్ని వీడకుండా స్వగ్రామంలోనే నివశిస్తూ 24 గంటలు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వచ్చారు. టీడీపీ కార్యకర్తల కష్ట సుఖాలో భాగస్వాములై వారికి ఏ ఆపద వచ్చినా ముందుండి నడిచారు. ఐతే నరేంద్ర కుమార్‌ను రాజకీయంగా నిలువరించలేమని భావించిన అప్పటి వైసీపీ పాలకులు అక్రమ కేసులు పెట్టి జైలులో నిర్బంధించటమే కాకుండా సంగం డెయిరీని స్వాధీనం చేసుకునేందుకు కుటిల యత్నాలను సాగించారు. అయితే న్యాయ పోరాటాల ద్వారా నరేంద్ర కుమార్ రాజీలేని పోరాటం సాగించి సంగం డెయిరీని కాపాడుకోవటమే కాకుండా 32 రోజుల సుదీర్ఘ కాలం తర్వాత జైలు నుంచి విడుదలయ్యారు. అక్రమ నిర్బంధం నరేంద్ర కుమార్‌ను మరింత రాటుతేలిన పోరాటయోధుడిగా మార్చివేసింది. ఓవైపు పొన్నూరులో టీడీపీని బలోపేతం చేయటమే కాకుండా మరోవైపు సంగం డెయిరీని ప్రభుత్వం నుంచి వచ్చే ఇబ్బందులు తట్టుకుంటూనే దక్షిణ భారతదేశంలోనే అగ్రపథంలో నిలిపేలా అభివృద్ధి బాట పట్టించారు. నరేంద్ర కుమార్ రాజకీయ చతురత ముందు ప్రత్యర్థుల ఆటలు సాగలేదు. అడుగు బయటకు పెడితే ముందస్తు అరెస్టులు, అక్రమ కేసుల నమోదు నరేంద్ర కుమార్‌ను నిలువరించలేకపోయాయి. ఇటీవల జరిగిన ఎన్నికలో 7వసారి పోటీ చేసిన నరేంద్ర కుమార్ విజయం సాధించి శాసన సభలోకి అడుగుపెట్టారు. నరేంద్ర కుమార్ ప్రమాణస్వీకారం సందర్భంగా కూటమి పార్టీల శ్రేణులు 6.0 వర్షన్ నరేంద్ర కుమార్ ప్రారంభించారు అంటూ చేసిన నినాదాలు పట్టణ వాసులను ఆనందపరిచాయి.



శాసన సభలో ప్రమాణస్వీకారం చేస్తున్న నరేంద్ర కుమార్

మనోహర్ మూడోసారి..

తెనాలి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో జనసేన అభ్యర్థిగా గెలుపొందిన మనోహర్ ఆ పార్టీలో కీలకపాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. కూటమి పొత్తులో భాగంగానే జనసేన తరుపున ఆయనకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంలో చంద్రబాబు క్యాబినెట్‌లో మంత్రిగా అవకాశం దక్కింది. ఆయనకు పౌరసరఫరాల శాఖను కేటాయించగా ఇటీవలే మంత్రిగా ప్రమాణస్వీకారం కూడా పూర్తి చేశారు. 2024 ఎన్నికలు పూర్తయ్యాక తొలి అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ప్రారంభంకావడంతో శాసన సభలో సభ్యులందరూ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని పూర్తిచేశారు. దీనిలో భాగంగా తెనాలి శాసన సభ్యుడిగా మనోహర్ ప్రమాణం చేశారు. అనంతరం ఆయనను జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. దీనికి ముందు ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరిని కలిసి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు రెండు పర్యాయాలు ఆయన ఎమ్మెల్యేగా గెలిచి ఉపసభాపతిగా, సభాపతిగా ఉన్నత పదవులను అలంకరించారు. ప్రస్తుత మంత్రివర్గంలో మాత్రం కీలకంగా ఉన్న పౌరసరఫరాల శాఖ బాధ్యతలు తీసుకుని ఆ శాఖలో గత ప్రభుత్వ కాలంలో జరిగిన భారీ అవకతవకలను వెలికితీయడంలోనూ ముందున్న విషయం తెలిసిందే.



ప్రమాణ స్వీకారం అనంతరం ప్రొటెం స్పీకర్ బుచ్చియ్య చౌదరితో మంత్రి మనోహర్ కరచాలనం



అసెంబ్లీలో మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆలింగనం చేసుకుంటున్న పవన్‌కల్యాణ్

కొలకలూరులో అక్రమ క్వారీయింగ్

● ప్రభుత్వం మారాక కూడా తగ్గని వైసీపీ నేతల అక్రమాలు
● పట్టించుకోని మైనింగ్ శాఖ అధికారులు

తెనాలి, జూన్ 22, (ఆంధ్రజ్యోతి): కొలకలూరులో ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు ఇంకా ఆగలేదు. ప్రభుత్వం మారినా, సాక్షాత్తూ మంత్రే అక్రమాలను ఉపేక్షించేదిలేదని హెచ్చరించినా వైసీపీ నేతల ఆగడాలు మాత్రం ఆగటంలేదు. అటు మైనింగ్ శాఖ అధికారులు ఇంకా నిద్ర నటిస్తున్నారు. దీంతో రబ్బీస్ అక్రమ తవ్వకాలకు తెరపడలేదు. తెనాలి మండలం కొలకలూరులో రబ్బీస్ క్వారీయింగ్ గత ప్రభుత్వ కాలంలో అడ్డూఅదుపు లేకుండా సాగిపోయింది. అనుమతులు గోరంతయితే, తవ్వకాలు తాడిచెట్టంత లోతులో సాగిపోయాయి. అయితే వైసీపీ సర్కారు ఇంటికి వెళ్లాక, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయినా అక్రమార్కులకు మాత్రం అడ్డులేకుండాపోతోంది. కొత్త ప్రభుత్వమే ఇకపై అక్రమాలు జరగటానికి వీలులేదని ప్రక్షాళన మొదలుపెడితే, వీరు మాత్రం ఇంకా బరితెగించి తవ్వకాలు పాల్పడుతూనే ఉన్నారు. గతంలో భూగర్భ ఘనుల శాఖ అధికారులు ఎక్కడ ఏమి జరిగినా కన్నెత్తయినా చూడకుండా వదిలేశారు. ఇప్పుడు ఆ పద్ధతి మారాల్సిఉంటే, అయినా తాత్సారం చేయటం విమర్శలకు తావిస్తోంది. గతంలోనే ఇక్కడ అక్రమ తవ్వకాలు చేపట్టటంపై గ్రామస్థులు అనేక సందర్భాల్లో నిరసన తెలియచేశారు. అనుమతులు లేకుండా పరిమితికిమించి లోతులో మట్టి తవ్వేస్తుండటంతో ఆ గుంతల్లో పడి స్థానికులు, చిన్నారులు మరణించిన సంఘటనలతో గ్రామస్తులు అడ్డుకునే ప్రయత్నాలు చేసినా, గతంలో అవేమీ ఫలించలేదు. దౌర్జన్యంతో తవ్వకాలు సాగించేశారు. అయితే ప్రభుత్వం మారాక తవ్వకాలు ఆగిపోతాయనుకుంటే, శుక్రవారం అర్ధరాత్రి కూడా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరగటం, పదుల సంఖ్యలో లారీలు మట్టి తరలించుకుపోతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడుకూడా అక్రమ తవ్వకాలు ఆగకుంటే ఊరుకే ముప్పు తప్పదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక వైసీపీ నేతలతోపాటు, గుంటూరు, మంగళగిరికి చెందిన గత ప్రభుత్వ పెద్దల అండదండలున్న మరో ఇద్దరు నేతలు ఈ అక్రమాలకు ప్పాపడుతున్నట్టు సమాచారం. ప్రభుత్వం ఏర్పడటం, అన్నీ అవగాహనకొచ్చేలోపు మరికొన్ని రోజులు గుట్టు చప్పుడు కాకుండా మట్టి తరలించేసే పనులు మాత్రం రాత్రుల్లో యథేచ్ఛగా చేసేస్తున్నారు. ప్రభుత్వం మారాక కూడా ఇదే తరహాలో తవ్వకాలు జరిగితే మేము గ్రామంలో ఉండలేమని, త్వరలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలసి తమ ఆవేదన, అక్రమ తవ్వకాల తీరుపై వివరించాలనే నిర్ణయానికొచ్చామని స్థానికులు చెబుతున్నారు. మైనింగ్ అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని వారు స్పందించకుంటే ప్రభుత్వ పెద్దల దగ్గరకు వెళతామని వారు చెబుతున్నారు.

ఘనంగా వీవీఐటీ స్నాతకోత్సవం

● పదిమంది విద్యార్థులకు బంగారు పతకాలు
● ముఖ్యఅతిథిగా హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మధరావు

పెదకాకాని, జూన్ 21: నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల స్నాతకోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈస్నాతకోత్సవ వేడుకలలో క్లాస్ ఆఫ్ 2024కు ఉత్తమ ప్రతిభ కనబరచిన 10మంది విద్యార్థులకు బంగారు పతకం, ప్రశంసా పత్రాలతోపాటు 1116 మంది పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ డాక్టర్ కె. మన్మథరావు, జె.ఎన్.టి.యు. కాకినాడ గౌరవ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.వి.ఆర్. ప్రసాదరాజు, వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. 2020-2024 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి కళాశాల టాపర్‌గా నిలచిన విద్యార్థిని జి.ఎన్.ఎస్.ఎస్.ఎల్. వెంకటజ్వాలకు వాసిరెడ్డి వెంకటాద్రి బంగారు పతకాన్ని జస్టిస్ మన్మథరావు అందచేశారు. అనంతరం వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి కళాశాల వార్షిక ప్రణాళికను భవిష్యత్తు కార్యాచరణను ఈ వేడుకలో ప్రకటించారు.ఈ కార్యక్రమములో డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో బంగారు పతకం, ప్రశంసా పత్రం ను అందజేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ డాక్టర్ కే మన్మధరావు, జేఎన్టీయూ వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు, విద్యాసాగర్ తదితరులు

మలేరియా రహిత సమాజాన్ని సాధిద్దాం

జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలి, మారీసుపేట జూన్ 21: మలేరియా రహిత సమాజాన్ని సాధిద్దామని జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. స్థానిక బీసీ కాలనీలో శుక్రవారం మలేరియా సిబ్బంది ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం పాల్గొని తమ సిబ్బందితో మలేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలో దోమలు గుడ్లు పెట్టి అవి ప్రౌఢ దోములుగా మారడానికి ఎనిమిది నుంచి పది రోజులు పడ్తుందన్నారు. ప్రజలందరూ వారంలో ఒకటి లేదా రెండుసార్లు నీటి నిల్వలను తొలగించడం వలన దోమ సంతతి అభివృద్ధి చెందకుండా చూడవచ్చన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు వ్యాధుల లక్షణాలను వివరించారు. అనంతరం ఫ్రైడే డ్రైడే అవగాహన కరపత్రాలను పంపిణీచేసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారిణి డాక్టర్ టీబీజాన్, సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్, పట్టణ మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, యూయల్‌బీ విస్తరణాధికారి అండె బాలచంద్రమౌళి, ఆరోగ్య పర్యవేక్షకులు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరావు, శివరామప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు షేక్ బాషిత్, షేక్ రషీద్, ఆరోగ్య కార్యకర్తలు, డాక్టర్ పాల్‌రాజ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.



ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం, బాలచంద్రమౌళి తదితరులు

ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం

తెనాలి, మారీసుపేట జూన్ 21: పట్టణ పరిశర ప్రాంతాలలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి వైశ్యవిద్యానిధి హాస్టల్ ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, ఆత్మీయ అతిధిగా పురపాలక సంఘ కమిషనర్ బి శేషన్నలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయుట వలన కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పెండేల సుబ్బారావు, పట్టణ మున్సిపల్ మాజీచైర్మన్ పెండేల వెంకట్రావు, సుగ్గుల వెంకటప్పయ్య, జీ శ్రీనివాసరావు, కె నాగేంద్రం పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట: స్థానిక ఈటీ కాలనీలోని హరిత ఇంగ్లీష్ మీడియా స్కూల్ నందు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను శ్రీ ఆంజనేయ ధ్యాన యోగమండలి వారు నిర్వహించారు. ధ్యాన మండలి సభ్యులు కిషోర్ యోగ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● తెనాలి, మారీసుపేట జూన్ 21: స్థానిక చెంచుపేటలోని జేఎంజే కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా సభ్యులు కొల్లిపర కుమారస్వామి ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థినులుచే యోగా తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అమూల్ మేరీ, డాక్టర్ అరుణ సుజాత, సిస్టర్ నిర్మలజ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్‌కు శిక్షణ

తెనాలి, మారీసుపేట జూన్ 21: పట్టణంలోని అసిస్టెంట్ మలేరియా కార్యాలయంలో శుక్రవారం ల్యాబ్ టెక్నీషియన్స్‌కు పునఃశ్చరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ల్యాబ్ టెక్నీషియన్స్‌కు వారు నిర్వహిస్తున్న పరీక్షలలో మరింత నైపుణ్యాన్ని పెంపొందించడానికి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

కేంద్ర సహాయమంత్రి పెమ్మసానికి ఘన స్వాగతం

పెదకాకాని, జూన్ 21: గుంటూరు ఎంపీగా విజయం సాధించి కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి గుంటూరుకు వచ్చిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు వర్శిటీ వద్ద శుక్రవారం ఘన స్వాగతం లభించింది. గన్నవరం నుంచి గుంటూరు వస్తున్న ఆయనను వర్శిటీ ముఖద్వారం వద్ద తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్, తెలుగునాడు ట్రేడ్ యూనియన్ నాయకులు పెద్దఎత్తున తరలి వచ్చి బొకేలతో, శాలువాలతో సాదరంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్రమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి భాగస్వాములుగా నిలుస్తున్నందుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వర్శిటీ అధ్యాపకులు ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఆచార్య సుబ్బారావు, ఆచార్య వి.రవికుమార్, ఆచార్య సింహాచలం, ఆచార్య రామచంద్రన్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్, భవ్య, గోపి, హరీష్, రామన్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు వి. విష్ణు ప్రసాద్, నాయకులు డా.ఎం వెంకటరమణ తదితరులు కేంద్రమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసానికి స్వాగతం పలుకుతున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు



పొన్నూరులో సంబరాలు నిర్వహిస్తున్న కూటమి కార్యకర్తలు

కూటమి కార్యకర్తల సంబరాలు

పొన్నూరు టౌన్, జూన్ 21: 16వ శాసనసభ ఎమ్మెల్యేలుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్, పొన్నూరు శాసన సభ్యుడిగా ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా కూటమి కార్యకర్తలు పొన్నూరులో సంబరాలు నిర్వహించారు. జనసేన కార్యదర్శి, చేబ్రోలు పున్నారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. ముగ్గురు నాయకులు ప్రమాణస్వీకారం చేసిన అనంతరం బాణసంచా పేల్చి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణవాసులకు మిఠాయిలు పంచిపెట్టారు.

కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శులు తాళ్లూరి అప్పారావు, దేశంశెట్టి సూర్య, ఆకుల గోపి, సింగంశెట్టి శంకర్, సున్నా మోహన్, యలవర్తి వెంకటేశ్వరరావు, వేణు రామారావు, షేక్ గౌస్, కరిముల్లా, ధర్మారావు, నవీన్ తదితరులతోపాటు రెండు పార్టీల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు

పొన్నూరు టౌన్, జూన్ 21: మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో రేషన్ దుకాణంలో శుక్రవారం తహసీల్దార్ ఆర్.సూర్యనారాయణసింగ్ తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించి దుకాణంలోని 665 కిలోల బియ్యం, 3.5 కిలోల పంచదారను సీజ్ చేశారు. మధ్యాహ్న భోజన పథక బియ్యంలో కూడా వ్యత్యాసాలు ఉన్నట్లు తెలిపారు. దుకాణ యజమాని శివకృష్ణపై చర్యలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో సీఎస్‌డీటీ కె భువనేశ్వరి, ఆర్‌ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి మనోహర్ కొల్లిపర పర్యటన

● భారీ ర్యాలీ ● మండల జనసేన అధ్యక్షుడు వెంకయ్యనాయుడు

కొల్లిపర, జూన్ 21: ఏపీ ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం తొలిసారిగా కొల్లిపర వస్తున్న సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు మండల జనసేన అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నందివెలుగు నుంచి కొల్లిపర వరకు సాయంత్రం 4 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జనసేన నాయకుడు భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ర్యాలీని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జనసేన నాయకులు భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, పేరికల రాంబాబు, చాగంటి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీచేస్తున్న మురళి, సుబ్బారావు, కుటుంబసభ్యులు

శ్రీరామమూర్తి సేవలు చిరస్మరణీయం

తెనాలి రూరల్, జూన్ 21: మండలంలోని అంగలకుదురు గ్రామానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, నటుడు, దర్శకుడు దివంగత రావినూతల శ్రీరామమూర్తి కళారంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకుడు వీరవల్లి మురళి అన్నారు. శుక్రవారం దివంగత రావినూతల శ్రీరామమూర్తి 73వ జయంతిని పురస్కరించుకుని వారి కుటుంబసభ్యుల సహకారంతో జేఎంజే స్వధార్ హోమ్‌లో విద్యార్థినులకు బ్యాగులు, పుస్తకాలు, బాక్సులు, స్వీట్లు, పంపిణీచేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, పట్టణ కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి .గరికపాటి సుబ్బారావులు దివంగత రావినూతల శ్రీరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ శ్రీరామమూర్తి తెనాలిలో తొలినాటక నంది అవార్డును దక్కించుకుని మన ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. ఆయన పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈగా పనిచేస్తూనే కళామతల్లికి సేవచేశారన్నారు. మురళి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా ఉగాది పురస్కారమందుకున్న గొప్పవ్యక్తి దివంగత శ్రీరామమూర్తిఅని ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు ప్రకాష్, దత్తఅనిరుద్, శివప్రసాద్, ఆనంద్, రాజేష్, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

పొన్నూరు టౌన్, జూన్ 21: ఈ నెల 23వ తేదీన స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. రోటరీ క్లబ్, శంకర నేత్రాలయం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శుక్లాల ఆపరేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించదలుచుకున్న వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులతో శిబిరానికి హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9849220386, 6302975214, 855851521 నెంబర్లలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

నేడు అత్తోట పరిధిలో విద్యుత్ నిలిపివేత

కొల్లిపర, జూన్ 21: మండల పరిధిలోని అత్తోట ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చివలూరు, సిరిపురం, అత్తోట, అత్తోట యాదవపాలెం, కుంచవరం, దంతలూరు గ్రామాల్లో విద్యుత్ ఉండదని తెలియజేశారు.